
సాక్షి
మెదక్
శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



మైమరిపించే 'వన విజ్ఞాన కేంద్రం'
పోచారం అభయారణ్యానికి విజ్ఞాన యాత్రలకు వస్తున్న విద్యార్థులకు అటవీ సంరక్షణ, వన్యప్రాణులపై ఫారెస్ట్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. 8లో



పెళ్లయిన 18 రోజులకే..
సోదరులకు రాఖీలు కట్టడానికి భార్య వెంట భర్త అత్తారింటికి వచ్చిన నవ వరుడు పెట్రోల్ కోసం బయటికి వచ్చి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు విడిచాడు. 8లో

9వ వరకు లోక్ అదాలత్
మెదక్ మున్సిపాలిటీ: రాజీ పడదగిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆమె మాట్లాడారు. నేటి నుంచి 9వ తేదీ వరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సామరస్య ధోరణితో కేసులను పరిష్కరించుకోవాలని, చిన్నచిన్న పొరపాట్లతో పంతాలకు పోయి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు.

4 ఏళ్లు.. 50 వేల ఎకరాలు

- ఆయిల్‌పామ్‌పై విస్తృత ప్రచారం
- ఈ ఏడాది 5వేల ఎకరాల సాగు లక్ష్యం
- డ్రిప్‌తో పాటు మొక్కలకూ సబ్సిడీ


ఆయిల్‌పామ్ సాగుపై కలెక్టరేట్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్, అధికారులు (ఫైల్)

మెదక్: తక్కువ ఖర్చుతో దీర్ఘకాలిక ఆదాయం వచ్చే పంటల్లో ఒకటి ఆయిల్‌పామ్ సాగు. రాష్ట్రంలో ఆయిల్‌పాం 10 శాతం ఉత్పత్తి అవుతుండగా, మిగిలిని 90శాతం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ఉద్యానవన శాఖ అధికారులు సిద్ధమయ్యారు. రాబోయే నాలుగేళ్లలో 50 వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ఏడాది 5 వేల ఎకరాలకు తగ్గకుండా రైతులతో సాగు చేయించేందుకు కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఎకరాకు రూ.50,918 సబ్సిడీ..
ఎకరం ఆయిల్‌పామ్ సాగుకు సుమారు రూ.70 వేలు ఖర్చు అవుతుండగా ప్రభుత్వం రూ.50,916లను సబ్సిడీ అందిస్తోంది. ఎకరంలో సుమారు 57 మొక్కలు నాటేందుకు రూ.12,740 ఖర్చు అవుతుంది. ప్రభుత్వం రూ.11,600లతో పాటు రైతు వాటాగా రూ.1,140 చెల్లిస్తే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా డ్రిప్, ఎరువుల కోసం ఏడాదికి రూ.4,200 చొప్పున నాలుగేళ్లకు రూ.16,800లను రైతు ఖాతాల్లో జమచేస్తుంది. డ్రిప్ సిస్టంపై ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీలకు 90శాతం, 5 ఎకరాల్లోపు ఓసీలకు 90 శాతం, 5 ఎకరాలపైన ఉన్న ఓసీ రైతులకు 80శాతం సబ్సిడీ అందిస్తోంది. ఇప్పటి వరకు 600 ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులు ముందుకు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

కంపెనీ ఏర్పాటుకు సన్నాహం
ఆయిల్‌పామ్ నాలుగేళ్ల త్వరాత నుంచి పంట చేతికందుతుంది. ఎకరాకు రూ. 80 వేల నుంచి రూ.లక్ష ఆదాయం వస్తుంది. మెదక్‌లో కంపెనీ ఏర్పాటుకు 'ఎంఎస్ లివింగ్ ఫుడ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకు వచ్చిందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

లాభాలు అనేకం
తక్కువ నీటి వనరులు ఉన్న చోట కూడా ఈ పంటను సాగు చేయవచ్చు. ఎకరాకు 57 మొక్కలు నాటుకొని, అంతర పంటగా కూరగాయల సాగు చేసుకుంటే అదనపు లాభాలు పొందవచ్చు. ఆసక్తి ఉన్న రైతులు 79977 25284 నంబర్‌లో సంప్రదించాలి.
– నర్సయ్య, ఉద్యానవనశాఖ జిల్లా అధికారి

మదన్‌రెడ్డికి టికెట్ కేటాయించాలని ఆందోళన

హత్నూరలో వాటర్ ట్యాంక్ ఎక్కిన బీఆర్‌ఎస్ నాయకులు

హత్నూర(సంగారెడ్డి): ఎమ్మెల్యే మదన్ రెడ్డికి బీఆర్ఎస్ అధిష్ఠానం తక్షణమే ఎమ్మె ల్యే టికెట్ కేటాయించాలని హత్నూర మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేపట్టారు. ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఇక్కడకు చేరుకొని నల్ల రిబ్బన్ కట్టుకొని రోడ్డుపై మౌన దీక్షతో నిరసన తెలిపారు. మరికొందరు గ్రామపంచాయతీ ఆవరణలోని వాటర్ ట్యాంక్ ఎక్కి మదన్‌రెడ్డికి టికెట్ కేటాయించాలంటూ నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్యాంక్ పై నుంచి కిందకు దిగిరావాలని చెప్పినా ఫలితం లేకపోయింది. దీంతో వారు ఎమ్మెల్యేకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడుతూ.. టికెట్ మనకే వస్తుందని, ఎవరూ ఆందోళన చేపట్టాల్సిన అవసరంలేదని చెప్పడంతో నాయకులు కిందికి దిగారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మదన్‌రెడ్డికి మూడోసారి అవకాశం ఇవ్వాలని, లేదంటే సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువత మండల అధ్యక్షుడు కిషోర్, కార్మిక విభాగం మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బాల్య వివాహాలు చేయొద్దు


అవగాహన కల్పిస్తున్న సక్రుబాయి


కౌడిపల్లి(నర్సాపూర్): చిన్నతనంలో పెళ్లి చేయడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సక్రుబాయి అన్నారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు, బాలల అక్రమ రవాణా నిరోధంపై శుక్రవారం కార్వెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ముదిరాజ్ సంఘం సభ్యులకు అవగాహన కల్పించారు. బాలికలకు వయసు రాకుండా పెళ్లి చేస్తే మానసిక సమస్యలతో పాటు, శారీరక వృద్ధి తగ్గుతుందన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై వివరించారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 1098 లేదా 100కు ఫోన్‌చేయాలన్నారు. అనంతరం బాల్యవివాహాలు చేయబోమని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ దుర్గమణి, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు శాఖయ్య, గ్రామ అధ్యక్షుడు మల్లేశం, లక్ష్మణ్, కృష్ణ, పాండు పాల్గొన్నారు.

'ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడతాం'


కరపత్రం ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కేవలం కిషన్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సెప్టెంబర్ 2న గ్రామాల్లో, 5న మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మికుల కనీస వేతనాల జీఓను సవరించలేదని, ఉపాధి కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టే నిరసనలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు నర్సమ్మ, బస్వరాజ్, నాగరాజు పాల్గొన్నారు.

భిక్షాటన చేసి నిరసన


భిక్షాటన చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

మెదక్ కలెక్టరేట్: తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ సెకండ్ ఏఎన్ఎంలు శుక్రవారం కలెక్టరేట్ వద్ద భిక్షాటన చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి వైద్యశాఖలో సేవలందించిన తమను పర్మినెంట్ చేయాలన్నారు. 20 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని సెకండ్ ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా అమరుల స్తూపం


మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

మెదక్: ఢిల్లీలో నిర్మించే అమరవీరుల స్తూపం చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కోదండ రామాలయంలో కలశ పూజ నిర్వహించి, ఇంటింటా మట్టి సేకరించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల జ్ఞాపకార్థం స్తూపం నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, లోకేష్, పిట్టల సంజీవులు, కాశినాథ్, వీణ, శివ పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): అమర జవాన్ల స్మృతి వనం నిర్మాణానికి ఇంటింటా పిడికెడు మట్టి, బియ్యం సేకరిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం పరిణీత, జిల్లా ఉపాధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ తెలిపారు. కొత్తపల్లిలో మండల అధ్యక్షుడు సంతోష్‌తో కలిసి హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. వారితో మాజీ జెడ్పీటీసీ మల్లప్ప, గౌస్, వెంకట్, లక్ష్మణ్‌రావు, లింగం, దుర్గయ్య, శ్రావణ్, యాదగిరి, నర్సింలు ఉన్నారు.

'ఉన్నతి' శిక్షణతో ఉత్తమ బోధన

డీఈఓ రాధాకిషన్


ఉపాధ్యాయుల శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయులకు ఉన్నతి శిక్షణ ద్వారా మెరుగైన బోధన అందించేందుకు అవకాశం ఉంటుందని డీఈఓ రాధాకిషన్ అన్నారు. శుక్రవారం మండలంలోని మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల శిక్షణలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు టీచర్లు కృషి చేయాలని, సులువైన బోధనతో లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో చిన్నశంకరంపేట, చేగుంట, నార్సింగి, రామాయంపేట, నిజాంపేట, మాసాయిపేట, వెల్దుర్తి, తూప్రాన్, మనోహరాబాద్, మండలాలకు సంబంధించిన ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ శ్రీదేవి, డీఆర్పీలు రాజ్‌కుమార్, రవి కుమార్, ప్రభు, శివకుమార్ పాల్గొన్నారు.

సక్రమంగా హాజరుకావాలి..
విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కాకుండా సక్రమంగా హాజరైనప్పుడే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని డీఈఓ రాధాకిషన్ అన్నారు. చిన్నశంకరంపేట మోడల్ స్కూల్‌ను సందర్శించిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. మొబైల్, టీవీలకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి ఉన్నారు.

జిల్లాకు 4 కొత్త కేజీబీవీలు
మెదక్ కలెక్టరేట్: జిల్లాకు నాలుగు కొత్త కేజీబీవీ పాఠశాలలు మంజూరైనట్లు డీఈఓ రాధాకిషన్ తెలిపారు. నార్సింగి, నిజాంపేట్, హవేళి ఘణాపూర్, మాసాయిపేట్ మండలాలకు వీటిని మంజూరు చేస్తూ రాష్ట్ర విద్యాశాఖ నుంచి జీఓ జారీ అయినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని నార్సింగి, హవేళి ఘణాపూర్‌లో కాంట్రాక్టు పద్ధతిన బోధన సిబ్బంది భర్తీకి నిర్వహించిన రాత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నేడు కలెక్టరేట్‌లో ధృవపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 11గంటలకు డీఈఓ కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

చెరువులకు పూర్వ వైభవం

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం వచ్చిందని, రైతులు, మత్స్యకారులు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెల్దుర్తిలో కుడి చెరువు, ఆరెగూడెం రాంరెడ్డి చెరువులో ప్రభుత్వం పంపిణీ చేసిన చేప పిల్లలను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వదిలారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజా బలం మేరకు వచ్చే ఎన్నికల్లో టికెట్ వస్తుందని, దీనిపై ఎలాంటి అనుమానం లేదని అన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా పట్టించుకోనని, సీఎం కేసీఆర్‌పై నమ్మకం ఉందని అన్నారు. కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టానని, ప్రజల మద్దతు తనకే ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వరూప, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఆంజనేయులు, ఫిషరీస్ ఏడీ రజని, సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, గంగపుత్రులు పాల్గొన్నారు. అనంతరం వీఓఏలకు వేతనాలు పెంచడంపై ఆ సంఘం నాయకులు ఎంపీడీఓ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొన్నారు. వీఓఏలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి అభిమానాన్ని చాటుకున్నారు. అంతకుముందు మెల్లూర్ పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం అధ్యక్షుడు అశోక్, సృజన, సంతోష్, మహేశ్, ఆసియాభేగం, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు చెందిన నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

మహిళల భద్రతకే షీ టీమ్స్


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: మహిళా భద్రతే షీ టీమ్స్ లక్ష్యమని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వినాయక చవితి సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలకు అన్ని చోట్లా సురక్షితమైన వాతావరణం కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం షీటీంలను ఏర్పాటు చేసిందన్నారు. మెదక్, తూప్రాన్ డివిజన్ల వారీగా షీ టీమ్స్ అధికారులు పని చేస్తున్నారని, అవసరం ఉన్నవారు. షీ టీంకు ఫోన్ లేదా వాట్సాప్ 8712657963 నంబర్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, షీటీమ్ ఏఎస్ఐ రుక్సానా, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి డాక్టర్ డి.రామానాయుడు విజ్ఞానజ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యా సంస్థ, వ్యవసాయ పాల్‌టెక్నిక్ కళాశాలలో ఆరునెలల పాటు అందించే శిక్షణకు అర్హులైన యువత దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ అర్జునరావు, ఫీల్డ్ కోఆర్డినేటర్ జగదీష్ శుక్రవారం తెలిపారు. పదో తరగతి, తత్సమాన విద్యార్హత కలిగి 25 ఏళ్లలోపు ఉన్న గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువత అర్హులన్నారు. వ్యవసాయ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. ఆధునిక సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, శాస్త్రీయ వ్యవసాయం, మార్కెటింగ్‌లో మెలకువలు నేర్పిస్తారన్నారు. ఈనెల 9లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 81850 60769, 81062 55535 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ ఆదాయం.. కార్మికుల ఆనందం


మిఠాయిలు తినిపించుకుంటున్న ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు

రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆగస్టు 31న ఆర్టీసీకి రెండింతల ఆదాయం వచ్చిందని ఆర్టీసీ డీఎం సుధా తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం మెదక్ ఆర్టీసీ డిపో కార్యాలయం వద్ద ఆమె మాట్లాడుతూ.. సాధారణ రోజుల్లో రూ.13 లక్షల ఆదాయం రాగా, రాఖీ పండుగకు రూ.23,09,420లు వచ్చినట్లు పేర్కొన్నారు. ఇందుకు కృషి చేసిన డిపో ఉద్యోగులు, కార్మికులను అభినందించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. – మెదక్

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే

ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

మెదక్: ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దుచేసి, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య డిమాండ్ చేశారు. యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిర్వహించిన ధర్నాకు మెదక్ నుంచి పలువురు ఉపాధ్యాయులు తరలివెళ్లారు. జూన్ నెలతో పీఆర్‌సీ గడువు ముగిసిందని, వెంటనే కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, ఉపాధ్యాయ ఎడిటర్ ఏ.శశిధర్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ ముద్దుల సత్యనారాయణ, హీరా లాల్, పద్మ, యాదగిరి, గోపాల్ ఉన్నారు.

ఆర్డీఓకు వినతి
నర్సాపూర్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సామ్యానాయక్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ ఆర్డీఓకు మెమోరాండం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు వీరేశం, ధన్‌సింగ్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి చందర్, జిల్లా కార్యదర్శి యాదగిరి, నాయుడు, వెంకటస్వామి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


నల్లబ్యాడ్జీలతో నిరసన..
చేగుంట(తూప్రాన్): సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం తపస్ సంఘం నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాతు సురేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ గియాసున్నీసా బేగంకు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, మాధవి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్, గోపాల్, మండల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ..
మెదక్ కలెక్టరేట్: పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్టీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విట్టల్ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహదినంగా పాటించి, డీఆర్‌ఓకు మెమోరాండం సమర్పించినట్లు తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రణీద్‌కుమార్, రాజగోపాల్‌గౌడ్, పోచయ్య, భూపతిగౌడ్, రవీందర్ గౌడ్, మోహన్, వేణుగోపాల్, రాజు, ఐలయ్య, దిలీప్ కుమార్, అరుణ్ కుమార్, శ్రీనివాస్, సుధీర్, ఆనంద్, జబ్బార్, నవీన్, రత్నాకర్ పాల్గొన్నారు.


చేగుంటలో నిరసన తెలుపుతున్న తపస్ నాయకులు

కాంగ్రెస్‌లో లోకల్ లొల్లి!

- స్థానికేతరులకు టికెట్ ఇవ్వొద్దంటున్న లోకల్ లీడర్లు
- చంద్రశేఖర్‌ను వ్యతిరేకిస్తున్న జహీరాబాద్ నేతలు
- తాను రాజనెల్లి వాసినే.. అంటున్న మాజీ మంత్రి
- టికెట్ కోసం ఎనిమిది మంది దరఖాస్తు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీలో స్థానికత అంశం తెరపైకి వస్తోంది. ఈ టికెట్‌ను స్థానికులకే కేటాయించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఇటీవల బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్‌కు టికెట్ దక్కడం ఖాయంగా కనిపిస్తుండటంతో స్థానిక నేతలు వ్యతిరేకిస్తున్నారు. గతంలో మాదిరిగా ఇప్పుడు కూడా స్థానికేతరులకు టికెట్ ఇస్తే ఏళ్లుగా పార్టీలో ఉన్నవారికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టికెట్ కోసం చంద్రశేఖర్‌తో పాటు బొల్లు కృష్ణమూర్తి, బేగరి నరేష్, కె.భీమయ్య, బేగరి గోపాల్, కందం సుజాత, బేగరి ఈశ్వర్ దరఖాస్తు చేసుకున్నవారిలో ఉన్నారు. ఇందులో నలుగురు స్థానిక నాయకులు కాగా, మిగిలిన వారు స్థానికేతరులున్నారని, స్థానికేతరులకు టికెట్ ఇస్తే తమను అగౌరవపరిచినట్లేనని గోపాల్, సుజాత, భీమయ్యతోపాటు తదితర నాయకులు ఇటీవల తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇలా ప్రతీ ఎన్నికల్లో స్థానికేతరులను తెచ్చి బరిలోకి దింపితే స్థానిక నాయకులకు ఎప్పుడు అవకాశాలు వస్తాయని ప్రశ్నించారు.

నేనూ స్థానికుడినేనంటున్న చంద్రశేఖర్
వికారాబాద్ ఎమ్మెల్యేగా ఐదుసార్లు పని చేసిన మాజీ మంత్రి చంద్రశేఖర్ తాను జహీరాబాద్ నియోజకవర్గ వాసినేనని చెప్పుకుంటున్నారు. తన తల్లిదండ్రులు కోహీర్ మండలం రాజనెల్లి వాసులని, సోదరులదీ ఇదే గ్రామమని స్పష్టం చేశారు. ఇటీవల రాజనెల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వికారాబాద్ జిల్లా మర్పల్లిలో ఉన్న చంద్రశేఖర్ సుదీర్ఘ కాలం పాటు జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. రానున్న ఎన్నికల్లో ఇక్కడి నుంచి బరిలోకి దిగాలని స్థానిక నేతల మద్దతు కూడగట్టుకుంటున్నారు. కాగా జహీరాబాద్ నియోజకవర్గంలో 70 శాతానికి మించి కేడర్, ద్వితీయ శ్రేణి నేతలు చంద్రశేఖర్‌కు అనుకూలంగా ఉన్నారనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

గతంలో గీతారెడ్డి
జహీరాబాద్‌లో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా విజయం సాధించిన గీతారెడ్డి కూడా స్థానికేతర నాయకురాలే. సికింద్రాబాద్‌కు చెందిన ఆమె ఎస్సీ రిజర్వ్‌డు స్థానం జహీరాబాద్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని ఆమె అనుచరవర్గం చెబుతోంది. గీతారెడ్డి మాదిరిగానే ఇప్పుడు కూడా స్థానికేతరులకే టికెట్ ఇస్తే తమకు అన్యాయం తప్పదని వాపోతున్నారు.

నరోత్తం బీఆర్‌ఎస్‌లో చేరికతో..
కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరోత్తం ఇటీవల ఆ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. జహీరాబాద్ కాంగ్రెస్ టికెట్ రేసులో ఉన్న ఆయన బీఆర్‌ఎస్‌లో చేరడంతో చంద్రశేఖర్‌కు మార్గం సుగమమైందనే అభిప్రాయం ఆ పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

సంగారెడ్డి టౌన్ : గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పోతిరెడ్డిపల్లిలో శివ బ్యాంకటాల్ వెనుక భాగంలో గుర్తు తెలియని వ్యక్తి (35) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వారు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వివరాలు తెలిస్తే 87126 56719, 87126 56746 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో 12 మేకల మృత్యువాత


మృత్యువాత పడిన మేకలు

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యుదాఘాతంలో 12 మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. ఈ సంఘటన మండల పరిధిలోని డప్పూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింహులు, శంకర్ .. 52 మేకలను మేత కోసం పొలానికి తోలుకెళ్తున్నారు. ముస్లిం శ్మశాన వాటిక వద్దకు రాగానే 11 కేవీ తీగ తగిలి 12 మూగజీవాలు విద్యుత్‌షాక్‌తో మృత్యువాతపడ్డాయి. మిగతావి కుడివైపునకు ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడ్డాయి. మృతిచెందిన వాటి విలువ రూ.1.80 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. నష్ట పరిహారం వచ్చేలా చూస్తానని ఏఈ అర్జున్ తెలిపారు

పాముకాటుతో ఆవు మృత్యువాత

దుబ్బాకటౌన్: పాముకాటుతో పాడి ఆవు మృత్యువాత పడిన సంఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన రైతు కిష్టంగారి రమేశ్‌రెడ్డి వ్యవసాయ పొలం వద్ద ఆవును బయట కట్టేశాడు. సాయంత్రం పాలు పితికేందుకు వెళ్లగా మృతిచెంది కనిపించింది. అయితే పాము కాటుకు గురై మరణించిందని గుర్తించాడు. సుమారుగా రూ.80 వేలకు పైగా నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

గంజాయి విక్రేత అరెస్ట్

సిద్దిపేటకమాన్: గంజాయి విక్రేతను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి కథనం ప్రకారం.. నూతన బస్టాండ్ వద్ద ఓ వ్యక్తి గంజాయి అమ్ముతున్నాడనే నమ్మదగిన సమాచారంతో గురువారం వన్ టౌన్ ఎస్‌ఐ నరసింహరావు సిబ్బందితో కలిసి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. విచారించగా కూలీ పనులు చేస్తూ ముర్షద్‌గడ్డలో నివాసం ఉంటున్న సోహెబ్‌గా గుర్తించారు. విచారణలో నిందితుడు తప్పు ఒప్పుకున్నారు. అతడి నుంచి 290 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శుక్రవారం తెలిపారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాలు కలిగి ఉన్నా, విక్రయించినా వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

మైమరిపించే 'వన విజ్ఞాన కేంద్రం'

పోచారం అభయారణ్యంలోని వన విజ్ఞానకేంద్రం కొత్త అనుభూతులకు నిలయంగా నిలుస్తోంది. ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన సఫారీ వాహనంలో ప్రయాణం ప్రత్యేకం అని చెప్పొచ్చు. ఇంకా ఎన్నో విశిష్టతలు దీని సొంతం. అంతేకాదు విజ్ఞాన యాత్రలకు వస్తున్న విద్యార్థులకు అటవీ సంరక్షణ, వన్యప్రాణుల గురించి ఫారెస్ట్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే సెలవు రోజుల్లో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుంది. జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా వస్తున్నారు.


వన్యప్రాణుల కళాకృతులు

- విజ్ఞాన యాత్రలో అటవీ సంరక్షణపై విద్యార్థులు అవగాహన
- అనుభూతినిస్తున్న సఫారీ ప్రయాణం
- ఆకట్టుకుంటున్న వన్యప్రాణుల కళాకృతులు
- వాచ్‌టవర్ ఎక్కితే పోచారం అటవీ ప్రాంతమంతా వీక్షించవచ్చు


సఫారీ వాహనంలో విద్యార్థులు

హవేళీఘనపూర్(మెదక్): పోచారం అభయారణ్యం గెస్ట్‌హౌస్ పక్కనే.. వన విజ్ఞాన కేంద్రం ఉంది. ఆరేళ్ల క్రితం రూ.60 లక్షలతో ప్రత్యేక భవనాన్ని నిర్మించారు. అందులో ఏర్పాటు చేసిన జింకలు, దుప్పిలు, నెమళ్లు, మన్నుబోతులు, అడవి పందులు ఇంకా పలు వన్యప్రాణుల కళాకృతులను వీక్షిస్తూ విజ్ఞాన యాత్ర పర్యటనకు వచ్చిన విద్యార్థులు సంతోషంగా వ్యక్తం చేస్తున్నారు. ఇంకా వీటి ఆహారం, భవిష్యత్‌లో కాపాడుకునే విధానం గురించి వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. టీవీలోనూ వివిధ రకాల బొమ్మలను చూపిస్తూ, సహజ సిద్ధంగా ఉన్న అడవులను కాపాడుకోవడం వల్ల జరిగే లాభాలు, జంతు సంరక్షణ గురించి వివరిస్తున్నారు.

కాగా, మెదక్– కామారెడ్డి జిల్లా సరిహద్దులో ఉన్న ఈ అభయారణ్యం మెదక్ పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అందులో లోపలికి వెళ్లేందుకు 4.5 కిలోమీటర్లు రోడ్డు ఉంది. ఈ దారి గుండా వెళ్తుతున్న కొద్దీ రకరకాల వన్యప్రాణులు కనిపిస్తుంటాయి. అయితే పర్యటన ఆసక్తికరంగా సాగడానికి అటవీ శాఖ అధికారులు సఫారీ వాహనం అందుబాటులో ఉంచారు. పెద్దలకు రూ.100, చిన్న పిల్లలకు రూ.50 చొప్పున రుసుం తీసుకుంటున్నారు. ఒక గైడ్ దగ్గరుండి అంతా తిప్పి చూపిస్తున్నారు. ఇక్కడ మమాలురోజుల్లో కంటే సెలవుల్లో సందర్శకుల సంఖ్య అధికంగా ఉంటుంది. ఈ జిల్లా నుంచే గాక సిద్దిపేట, సంగారెడ్డి, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి కుటుంబ సభ్యులతో వచ్చి ప్రకృతి ప్రేమికులు సరదాగా గడుపుతుంటారు. అంతేకాదు గెస్ట్‌హౌస్ వద్ద కొంతసేపు సేదతీరేలా కుర్చీలు, పచ్చని పార్కు అందుబాటులో ఉన్నాయి. ఇక వాచ్‌టవర్ పైనుంచి చూస్తే పోచారం అటవీ ప్రాంతం పచ్చని చెట్లు ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. ఈ అభయారణ్యంలో ఉన్న వన్యప్రాణులకు వేసవిలో గడ్డిని పెంచి ఆహారంగా అందిస్తుంటారు అధికారులు. సోలార్ మోటార్‌ను ఏర్పాటు చేసి సాసర్ ప్లేట్ల ద్వారా నీటిని అందుబాటులో ఉంచుతున్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


కృష్ణ

కంది(సంగారెడ్డి): ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఆరుట్లలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై రాజేష్ నాయక్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎల్లగారి కృష్ణ(24) జులాయిగా తిరుగుతూ మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని తల్లితండ్రులతో తరచూ గొడవపడుతుండేవాడు. గత నెల 31న రాత్రి 10 గంటలకు ఇదే విషయమై గొడవపడి ఇంటి నుంచి వెళ్లి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబీకులు గ్రామంలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం గ్రామశివారులోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి మొగులయ్య ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తండ్రి కొడుతున్నాడని..

- ఇంటి నుంచి వెళ్లిన బాలుడు అదృశ్యం


సిద్ధూ

కంది(సంగారెడ్డి): బాలుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని బేగంపేట తండాలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై రాజేష్ నాయక్ కథనం ప్రకారం.. తండాకు చెందిన సిద్ధూ (15)పుట్టుకతో మూగ. గత నెల 28న సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పటాన్ చెరు మండలం ఐలాపూర్‌లో ఉంటున్న పెద్దమ్మ వద్దకు వెళుతున్నానని చెప్పి వెళ్లి రాలేదు. తండ్రి లాల్ సింగ్ ఎప్పుడూ కొడుతుండేవాడని, భయపడి ఎక్కడికైనా వెళ్లిపోయి ఉంటాడని తాత దేవీసింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పెళ్లయిన 18 రోజులకే..

- బైక్‌ను ఢీకొన్న బస్సు.. నవ వరుడి దుర్మరణం
- జాతీయ రహదారిపై గ్రామస్తుల రాస్తారోకో


జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు


అశోక్

రామాయంపేట(మెదక్) : సోదరులకు రాఖీలు కట్టడానికి భార్య వెంట అత్తారింటికి వచ్చిన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పెళ్లయిన 18 రోజులకే మృత్యువాత పడటంతో తీవ్ర విషాదం నెలకొంది. బస్సు బైక్‌ను ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. ఈ సంఘటన మెదక్ జిల్లా కోమటిపల్లిలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నిజాంపేటకు చెందిన గుడ్ల అశోక్ (24) గత నెల 14న మండలంలోని కోమటిపల్లికి చెందిన అనితతో వివాహమైంది. రాఖీపౌర్ణమి సందర్భంగా భార్యతో కలిసి అత్తారింటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం బైక్‌లో పెట్రోల్ కోసం కోమటిపల్లి స్టేజీ వద్ద జాతీయ రహదారిపైకి వచ్చి యూటర్న్ తీసుకుంటుండగా, అతివేగంగా హైదరాబాద్ వైపు వెళుతున్న ప్రయివేట్ బస్సు రోడ్డుకు అవతలి వైపు దూసుకెళ్లి ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను రోడ్డుపై పడిపోవడం, తలపైనుంచి వెనుక టైర్లు ఎక్కడం, అక్కడికక్కడే మృతిచెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటనా స్థలి వద్దకు చేరుకొని ఆందోళనకు దిగారు. జాతీయ రహదారిపై బైఠాయించి రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. దీంతో వందలాది వాహనాలు నిలిచిపోయాయి. కోమటిపల్లి వద్ద రోడ్డుపై ఫ్లయి ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

- తపస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓకు వినతి


ఏఓకు వినతిపత్రాన్ని అందిస్తున్న తపస్ నాయకులు

సిద్దిపేటరూరల్: ఉద్యోగ పక్షపాతి అని చెప్పుకునే ప్రభుత్వం వారి జీవితాలతో చెలగాటమాడే నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎస్ రద్దు కోసం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రఘువర్ధన్ మాట్లాడారు. సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నామన్నారు. కొంతకాలంగా అనేక నిరసనలు చేపట్టినప్పటికీ ప్రభుత్వంలో ఏ విధమైన స్పందన లేదన్నారు. వెంటనే తేరుకొని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం స్పందించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనకర్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యుడు మహేందర్ రెడ్డి శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి , గోపాల్ రెడ్డి, లింగమూర్తి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్, శ్రీశైలం, పరమేశ్వర్, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహం


కబడ్డీ ఆడుతున్న కుకునూరుపల్లి విద్యార్థులు

కొండపాక(గజ్వేల్): క్రీడల నిర్వహణకు ప్రభుత్వం అధిక ప్రోత్సాహాన్నిస్తోందని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలకేంద్రంలో సర్పంచ్ పాల్కంపల్లి జయంతి సహకారంతో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండలస్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాఠశాలల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేస్తోందన్నారు. చదువుతోపాటు క్రీడలు కూడా అవసరమేనన్నారు. ఈ రంగానికి అధిక ప్రాముఖ్యత ఉందన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు క్రీడలపై ఆసక్తిలు పెంచుకునేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గ్రామీణ స్థాయి నుంచే ఎక్కువ శాతం యువత వివిధ క్రీడా రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఆటల్లో ఎలాంటి కోపతాపాలకు గురికాకుండా చూపరులకు కనువిందుగా ఉండేలా పోటీలు నిర్వహించాలన్నారు. కుకునూరుపల్లి హైస్కూల్లో క్రీడా మైదానం ఏర్పాటుపై సర్పంచ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అంతకు ముందు వివిధ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు వంగా నాగిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, ఎంపీటీసీ భూములుగౌడ్, కోఆప్షన్ సభ్యుడు అజీమొద్దీన్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు కందూరి ఐలయ్య, పీఎస్‌ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు పాల్కంపల్లి నరేందర్, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, పీఈటీలు, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌డీ ప్రీమియర్ లీగ్‌కు జిల్లా క్రీడాకారులు




సాయి హర్షిత్ అఖిల్ రఘువీర్ లక్ష్మీ సహస్ర

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహేంద్రసింగ్ ధోని క్రికెట్ అకాడమీ హైదరాబాద్ ప్రీమియర్ లీగ్ అండర్–14కు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ తెలిపారు. శుక్రవా రం స్థానిక మినీ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఆదివారం ఈ ఎంపికల కోసం మ్యాచ్‌లు నిర్వహించగా వికెట్ కీపర్, బ్యాటర్ సాయి హర్షిత్, బౌలింగ్ విభాగంలో అఖిల్ రఘువీర్, బౌలింగ్, బ్యాటింగ్‌లో లక్ష్మీ సహస్ర ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో జరుగనున్న ప్రీమియర్ లీగ్ ఆడనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఇంటిదొంగల ఆటకట్టు


నిందితులను చూపిస్తున్న సీఐ జార్జ్, పోలీసులు

- రూ.4 లక్షల సెల్ టవర్ సామగ్రి చోరీ
- పోలీసుల అదుపులో ఐదుగురు నిందితులు

పెద్దశంకరంపేట(మెదక్): పనిచేసే చోట విలువైన సామగ్రిని దొంగలించిన ఐదుగురిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అల్లాదుర్గం సీఐ జార్జ్, ఎస్‌ఐ బాలరాజు కథనం ప్రకారం. అసెండ్ టవర్స్ వారు ఆయా కంపెనీలకు సెల్‌టవర్స్ ఏర్పాటు చేస్తుంటారు. పెద్దశంకరంపేటలో గత నెల 28న పాత ఎయిర్‌టెల్ టవర్‌ను మరోచోటికి తరలించి, అక్కడ కొత్తది ఏర్పాటు చేశారు. అందులో నుంచి 40 మీటర్ల ఎత్తులో ఏర్పాటు చేసిన రూ.4 లక్షల విలువైన ఆర్‌ఆర్ యూనిట్‌లను పనిచేసే ఒడిశాకు చెందిన టెక్నీషియన్స్ చరణ్‌నాయక్, బలరాం ఫరీదా, మనోరంజన్, ప్రదీప్‌గొచ్చి, హైదరాబాద్‌కు చెందిన ఎండీ సద్దాం హుస్సేన్ చోరీ చేశారు. ఈ మేరకు అసెండ్ టెక్నీషియన్ కమ్మరి రవి ఫిర్యాదు చేశారు. స్థానిక కోళపల్లి టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా మహీంద్రా వాహనంలో వెళుతున్న వీరు అనుమానాస్పదంగా కనిపించారు. తనిఖీ చేయగా రీసివర్లు కనిపించాయి. ఈ మేరకు వాహనాన్ని సీజ్ చేసి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. 48 గంటల్లో కేసును ఛేదించిన ఎస్‌ఐ, ఏఎస్‌ఐ సునీత, సిబ్బంది రాంసింగ్, వినోద్, రాజులను సీఐ అభినందించారు.

బాధితులకు న్యాయం చేయాలి

- మృతదేహంతో ధర్నాకు యత్నం

చిన్నశంకరంపేట(మెదక్): బాకీదారుడు కొట్టాడని ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా, అతడి ఇంటి ఎదుట మృతదేహాన్ని వేసేందుకు యత్నించిన ఘటన మండలంలోని రామాయపల్లిలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాగోన్నల్ల కిష్టయ్య కుమారుడు రమణ(30)కు.. బాకీ ఉన్న ఎల్లం నగదు ఇవ్వకపోగా దాడి చేశాడని మెదక్‌లో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ ఘటన ఆగస్టు 20న జరగగా అప్పటికే సిద్దిపేట ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని శుక్రవారం రాత్రి గ్రామానికి తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు, బంధువులు బాకీదారుడి ఇంటి ఎదుట వేయడానికి ప్రయత్నించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీస్‌లు, గ్రామ పెద్దలు సర్దిచెప్పారు. మృతికి కారణమైన వారిపై మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పి శాంతింపజేశారు. పికెట్ ఏర్పాటు చేశారు.

స్తంభాన్ని ఢీకొన్న మినీవ్యాన్

- ఎనిమిది మందికి గాయాలు
- దైవదర్శనానికి వెళ్తి వస్తుండగా..


విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన టెంపో వాహనం

కొండపాక(గజ్వేల్): దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా డ్రైవర్ నిద్రలోకి జారుకోగా వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఎనిమిది మంది గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి కొండపాక గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన ఒకే కుటుంబానికి చెందిన డ్రైవర్ సందీప్, శ్రావణి, శ్యామల, కావేరి, సమీక్ష, మంజునాథ్, అఖిల్, శ్రీపాల్ టెంపో ట్రావెల్స్‌లో బుధవారం సిరిసిల్లా జిల్లా వేములవాడలోని రాజరాజన్న దర్శనానికి వెళ్లారు. తిరుగు పయనంలో కొండపాక శివారులో గాయత్రి టెంపుల్ సమీపంలో అర్ధరాత్రి 11.30 గంటలకు డ్రైవరు నిద్రమత్తులోకి వెళ్లడం, మినీవ్యాన్ రోడ్డు కిందికి దూసుకెళ్లడం, విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి బోల్తా పడటం జరిగింది. అందులో ఉన్న ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వాహనం ఢీకొట్టడంతో వైర్లు ఒకదానిపై మరొకటి పడి మంటలు చెలరేగాయి. వెంటనే కిందికి దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మళ్లీ చిరుత కలకలం

- భయాందోళనలో అటవీ ప్రాంత ప్రజలు
- తాజాగా మంగంపేటలో మృత్యువాత పడిన ఆవు
- చిరుతే చంపిందని రైతుల అనుమానం
- విచారణ జరుపుతున్న అధికారులు
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు

మండలంలో చిరుత సంచరిస్తున్నట్లు అటవీప్రాంత ప్రజలు, రైతులు అనుమానిస్తున్నారు. గ్రామాల్లోకి రాకుండా రక్షణగా ఏర్పాటు చేసిన కంచెలను కొందరు తొలగిస్తున్నారు. దీంతో గ్రామాల్లో చొరబడి మూగజీవాలను హతమారుస్తున్నాయని భావిస్తున్నారు. ఇటీవల మంగంపేటలో చోటుచేసుకున్న ఘటనపై అటవీ అధికారులు విచారణ జరుపుతున్నారు.


గడ్డపోతారంలోని హెటిరో పరిశ్రమలో ఓ గదిలో చిరుత (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): తాజాగా మండలంలోని మంగంపేట గ్రామ శివారులో మేతకు వెళ్లిన ఓ ఆవు మృత్యువాత పడింది. మెడపై గాట్లు ఉన్నాయి. దీంతో ఆవును పులి దాడి చేసి హతమార్చిందని రైతులు ఆరోపిస్తున్నారు. కాగా ఈ ప్రాంత రైతులు, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మంగంపేటలో ఇలాంటి ఘటనలు గతంలోనూ చోటుచేసుకున్నాయి. గ్రామాల్లోకి రాకుండా ఉండేలా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ ఘటనలు నిదర్శనం

తొమ్మిది నెలల క్రితం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని హెటిరో పరిశ్రమలోని ఓ గదిలోకి చిరుత చొరబడి చిక్కుకుంది. అప్పట్లో మత్తుమందు ఇచ్చి శ్రీశైలం అడువుల్లోకి అధికారులు తరలించారు. మంగంపేటలో ఏడాది క్రితం లేగ దూడపై దాడి జరిపి చంపేసింది. అధికారులు ఆనవాళ్లను గుర్తించి, అక్కడి ప్రజలను అప్రమత్తం చేశారు. రెండేళ్ల క్రితం బొంతపల్లిలోని ఓ రైతు పంట రక్షణ కోసం కంచె వేయడంతో కంచెలో చిరుత ఇరుక్కుంది. ఇటీవల ఇక్రిశాట్‌లో ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన బోనులోనూ చిక్కినట్లు అధికారులు చెబుతున్నారు. హత్నూర, నారాయణఖేడ్, రొయ్యపల్లి, శేర్‌ఖాన్‌పల్లి తదితర ప్రాంతాల్లోనూ ఆనవాళ్లు కనిపించిన ఘటనలు ఉన్నాయని అధికారులు, ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

భయపడాల్సి వస్తుంది

తరచూ అడవుల నుంచి గ్రామాల్లోకి పులులు వస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిరుత సంచరిస్తున్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సమీపంలోని రైతులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఫారెస్ట్ అధికారులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– శ్రవంతి, సర్పంచ్ మంగంపేట

కంచెలను తొలగించవద్దు

మంగంపేటలో ఆవు మృతిపై విచారణ జరుపుతున్నాం. ఆవును హైనా, ఇతర జంతువులు ఏవైనా చంపి ఉంటాయని భావిస్తున్నాం. ఈ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వీరికి పలు విషయాలపై అవగాహన కల్పిస్తున్నాం. జంతువులు గ్రామాల్లోకి రావొద్దనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కంచెలను కొంతమంది తొలగిస్తున్నారు. ఇది సరైంది కాదు. అడవుల్లోకి ఎవరూ కూడా వెళ్లవద్దు.

– శ్రీధర్‌రావు, జిల్లా అటవీ శాఖ అధికారి